క్లుప్తంగా

రక్తహీనత నివారణకు చర్యలు



ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్లో ఐరన్ మాత్రలు అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

తొండంగి: విద్యార్థుల్లో రక్తహీనత సమస్యను తగ్గించేందుకు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పీహెచ్‌సీ సిబ్బంది ఐరన్ మాత్రలు అందించారు. వేసవి సెలవుల్లో ప్రతి విద్యార్థి వారానికి ఒక టాబ్లెట్ వేసుకోవాలన్నారు. దీనిపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ పశువైద్యాధికారికి అభినందన



జిల్లా పశువైద్యాధికారి సూర్యప్రకాశరావు నుంచి అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ స్వప్న

జగ్గంపేట: కాకినాడ జిల్లా ఉత్తమ మహిళా పశు వైద్యాధికారిగా జగ్గంపేట మండలం మల్లిసాల పశు వైద్యాధికారి స్వప్నకు అవార్డు వరించింది. ఈ మేరకు ఆమె ఇటీవల కాకినాడలో జిల్లా పశు వైద్యాధికారి సూర్యప్రకాశరావు చేతుల మీదుగా అవార్డు పొందారు. శనివారం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వప్నను శుక్రవారం పలువురు అభినందించారు. మూగ జీవాలకు ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డు వచ్చిందని స్వప్న తెలిపారు. మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తానన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



బిడ్డతో 108 సిబ్బంది

తొండంగి: బెండపూడికి చెందిన గర్భిణి బత్రు సునీత శుక్రవారం 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సునీతకు నెలలు నిండటంతో పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. ఆమెను ఈఎంటీ సీహెచ్ మహేష్, పైలెట్ ఎస్.నాగేష్ తుని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వైద్యుల సూచనల మేరకు ప్రసవం చేశారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అంబులెన్స్ సిబ్బందికి సునీత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యాన్ అందజేత

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రికి సిరి ఫుడ్స్ నిర్వాహకుడు పిచ్చెట్టి కృష్ణ శుక్రవారం టేబుల్ ఫ్యాన్ బహూకరించారు. ప్రభుత్వ వైద్యాధికారి శైలజ, లయన్స్ ప్రతినిధి గోళ్ల నాగేశ్వరరావు, వివేకానంద సేవాసమితి ట్రస్టు చైర్మన్ మైరాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎస్ఈబీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. పెదశంకర్లపూడిలో పరారీలో ఉన్న గీసాల లోవరాజును, ఇ.గోకవరంలో ఐదు లీటర్ల సారాతో పిచ్చుక సూర్యావతిని అరెస్టు చేశామన్నారు. కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురం, ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

ఏలేరు కాలువలో పడి విద్యార్థి మృతి



వంగలపూడి శ్రీను (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: ఏలేరు కాలువలో పడి శుక్రవారం ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు రూరల్ ఒమ్మంగి గ్రామానికి చెందిన వంగలపూడి శ్రీను (16) వేములపాలెం శివారులోని ఏలేరు కాలువలో స్నానం చేసేందుకు తన సోదరుడు, స్నేహితులతో కలిసి వెళ్లాడు. శ్రీను ప్రమాదవశాత్తు కాలువలో గల్లంతై మృతి చెందాడు. అతను ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. మృతుడి మేనమామ కాపు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి

జగ్గంపేట: నరేంద్రపట్నం గ్రామ శివారు భావవరం అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రదేశంలో పేకాట శిబిరంపై గురువారం రాత్రి జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3,800 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు.

అదిగదిగో కలల వారధి



ప్రస్తుతం కాలనీ వాసులకు ఆధారమైన ఇరుకు వంతెన



ఎమ్మెల్యే చంటిబాబు చొరవతో విశాలంగా నిర్మిస్తున్న బ్రిడ్జి

- ఎమ్మెల్యే చంటిబాబు చొరవతో బ్రిడ్జి నిర్మాణం
- 24 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

గండేపల్లి: అదిగదిగో ఆశల వారధి కళ్ల ముందు కదలాడుతోంది.. కష్టాలు దాటేందుకు శరవేగంగా రూపుదిద్దుకుంటోంది.. 24 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపుతోంది.. దీంతో ప్రజల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో ప్రస్తుత శివాలయానికి సమీపంలో నెహ్రూ కాలనీ వాసులకు కొన్నేళ్లుగా సరైన మార్గం లేక అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. ఏ అవసరం వచ్చినా సమీపంలోని పుష్కర కాలవపై ఉన్న చిన్న వంతెనపై నుంచి వెళ్లాల్సి వచ్చేది. పాదచారులు, ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చినా తప్పించుకునేందుకు వీలులేని ఈ ఇరుకు వంతెన నుంచే రాకపోకలు సాగించాలి. గ్రామానికి శివారున ఉన్న ఈ కాలనీ వాసులకు 1998–99లో ఇళ్ల పట్టాలు అందజేశారు. కాలక్రమేణా శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకుని సుమారు 200 కుటుంబాలకు చెందిన 500 మంది నివసిస్తున్నారు. నాటి నుంచి కనీస వసతుల కన్నా మార్గమే ప్రధాన సమస్యగా మారింది. ఒక్కోసారి ఈ కాలనీ వాసులు తప్పని పరిస్థితుల్లో పొలాల వెంబడి ఉన్న మార్గాలను ఆశ్రయించాల్సి వచ్చేది. వర్షాకాలంలో కాలనీ నుంచి బయటకు రావాలంటే వీరిపడే వేదన వర్ణనాతీతం. నాటి నుంచి ఎందరో నాయకులకు ఈ సమస్యను విన్నవించినా నెరవేరకపోవడంతో ప్రజలు విసిగిపోయారు. ప్రస్తుతం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చొరవతో కొత్త బ్రిడ్జి నిర్మిస్తుండడంతో కాలనీవాసుల ఆనందానికి అవధులు లేవు. కాలనీలోకి వెళ్లేందుకు పుష్కర కాలువపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే చంటిబాబు చేసిన ప్రయత్నం ఫలించింది. దీంతో సీఎస్ఆర్ నిధులు సుమారు రూ. 48 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇది మరికొద్ది రోజుల్లోనే అందుబాటులోకి రానుంది. ఈ కాలనీ ఏర్పడిన నాటి నుంచి నాలుగు పర్యాయాలు పంచాయతీ పాలకవర్గం మారినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని కాలనీవాసులు దారబల్ల సత్తిబాబు, రమణం దుర్గారావు, అనకాపల్లి నాగేశ్వరరావు, పక్కృత్తి ఏసు, గొర్లు సత్యనారాయణ తదితరులు వివరించారు. కాలనీలోకి వాహనాలు వచ్చే పరిస్థితి లేక అనారోగ్యానికి గురైన వారిని, గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు చేతులతో సాయం పట్టి వంతెనను దాటించి 108 అంబులెన్స్‌లోకి ఎక్కించే వారమన్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే చంటిబాబు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు వంతెన నిర్మిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

మాట ఇచ్చాం.. నిర్మిస్తున్నాం



మా గ్రామం పరిధిలో నెహ్రూ కాలనీ వాసుల కష్టాలను ఎన్నికల ప్రచారంలో చూశాం. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం వంతెన నిర్మాణానికి బాటలు వేస్తున్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో వంతెనపై నుంచి రాకపోకలు ప్రారంభం కానున్నాయి.

– ములంపాక సురేష్, సర్పంచ్, నీలాద్రిరావుపేట

కష్టాలు తీరనున్నాయి..



గతంలో ఎందరో నాయకులు మాట ఇచ్చారే గాని మార్గం చూపలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చొరవతో కాలనీ వాసుల కష్టాలు తీరనున్నాయి. బ్రిడ్జి నిర్మాణానికి ఎంతో ప్రయత్నం చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

– చలగళ్ల దొరబాబు, ఎంపీపీ, గండేపల్లి

రూపులమ్మకు ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: స్థానిక గ్రామ దేవత రూపులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ మండల శాఖ కార్యదర్శి కటకం కిరీటి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ వీధిలోని అమ్మవారి ఆలయంలో పలు కార్యక్రమాలు జరిగాయి. పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాలకు చెందిన వారు హనుమాన్ చాలీసా, లలితా సహస్ర నామార్చన, విష్ణు సహస్ర నామార్చన చేశారు. మాతృశక్తి అధ్యక్షురాలు జి.మల్లేశ్వరి, కార్యదర్శి ఇందిర, దుర్గావాహిని అధ్యక్షురాలు ఎస్.కామాక్షి, కార్యదర్శులు మల్లేశ్వరి, సూర్యకుమారి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

తొండంగి: ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు శుక్రవారం తొండంగిలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం నుంచి పాఠశాలలకు మంజూరయ్యే నిధులు, ఖర్చు అంశాల్లో సోషల్ ఆడిట్‌పై రిసోర్సు పర్సన్ సుబ్బిరెడ్డి శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ షేక్ బాబ్జి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు అభినందన

గండేపల్లి: స్థానిక తహసీల్దార్ వీవీ సత్యనారాయణను మండల ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన్ని అభినందించారు. యూనియన్ ప్రెసిడెంట్ కోడిగుడ్ల శ్రీనివాస్, డీలర్ల సంఘ అధ్యక్షుడు మడికి గజ్జాలు, సభ్యులు నక్క వీరబాబు, పి.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్



జగ్గంపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం పూర్తి కావడంతో స్థానిక వేదిక ఫంక్షన్ హాలులో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తి కావడంతో పాటు రాష్ట్ర స్థాయిలో టాప్‌టెన్‌గా నిలిచిందన్నారు. అందరి సమష్టి కృషితోనే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. తద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, అడపా పార్థసారథి, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రానికి సుపరిపాలన వచ్చిందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సర్వే చేశారు. ఎంపీటీసీ సభ్యులు చెరుకూరి జయరాజ్, గొల్లపల్లి శ్రీను, నాయకులు కాపారపు వరప్రసాద్, నీలపల్లి అప్పారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో సిటిజన్ అవుట్ రీచ్

కోటనందూరు: మండలంలో సిటిజన్ అవుట్ రీచ్ కార్యక్రమం జోరుగా సాగింది. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. విద్యుత్ మీటర్‌తో ఆధార్ అనుసంధానం చేయించుకోవాలన్నారు. టీజే నగరం, బొద్దవరం, కోటనందూరు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పంచాయతీ విస్తరణాధికారి అరుణ్‌కుమార్ పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో కలిసి ఉపాధి పని ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు.

చలివేంద్రం ఏర్పాటు

తుని రూరల్: ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. వేర్వేరు పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేశామన్నారు. మండల పౌర సరఫరాల అధికారి పుణ్యవతి, డిప్యూటీ తహసీల్దార్ కుసరాజు పాల్గొన్నారు.

పేదలందరికీ రిజర్వేషన్లు కల్పించాలి

జగ్గంపేట: కుల మతాలకు అతీతంగా పేదలందరికీ రిజర్వేషన్లు కల్పించాలని దళిత ఐక్య సమైక్య పార్టీ జాతీయ అధ్యక్షుడు దొమ్మేటి రాజా సతీష్ అన్నారు. స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో దళిత నాయకుడు సాదే నరేంద్ర ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న వీరవరంలో కులాలకు అతీతంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వీరవరం నుంచి జగ్గంపేట మీదుగా చలో కాకినాడ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం గోడపత్రిక విడుదల చేశారు. పార్టీ నేతలు తుమ్మేటి రాజేష్, సతీష్, సాదే నరేంద్ర, జుత్తుక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కులమత రహిత స్వేచ్ఛా, దేశ ర్యాలీ ఉద్యమంలో భాగంగా చలో కాకినాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని దళిత ఐక్య సమైక్య జాతీ అధ్యక్షుడు రాజాసతీష్ అన్నారు. శుక్రవారం కిర్లంపూడిలో 'చలో కాకినాడ' గోడ పత్రికను ఆవిష్కరించారు. దొమ్మేటి రాజా సంజయ్, మాచారి రాజేశ్వరరావు, మడికి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి పెద్దపీట

జగ్గంపేట: ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా అన్నారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం పేదల చదువులకు భారీగా నిధులు కేటాయిస్తుందన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చర్యలు

శంఖవరం: స్థానిక ఐసీడీఎస్ పరిధిలో ఓ మినీ కార్యకర్త, నాలుగు అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని సీడీపీఓ పద్మావతి తెలిపారు. అంగన్‌వాడీ మినీ కార్యకర్త పోస్టు రౌతులపూడి మండలం గిన్నెలారం (ఎస్టీ), అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు రౌతులపూడి మండలం మెరక చామవరంలో (బీసీ–ఇ), శంఖవరం మండలం కత్తిపూడిలో (ఓసీ), వెంకటాపురంలో (ఓసీ), ప్రత్తిపాడు మండలం బాపన్నదారలో (ఎస్టీ) ఉన్నాయన్నారు. వచ్చే నెల 8వ తేదీలోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జగన్ పాలన ప్రజలకు చేరువ



ఎమ్మెల్యే పూర్ణచంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది

ఏలేశ్వరం: సీఎం జగన్ సారథ్యంలో ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువైందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రత్తిపాడులో ఏర్పాటు చేయడంతో ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలకు అందుబాటులోకి రానుంది. దీంతో మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ స్థానిక వెంకటేశ్వరా ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యేను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సారథ్యంలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని అన్నారు. ప్రజలకు సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు శంఖవరంతో పాటు ప్రత్తిపాడులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. సీడీపీఓ పద్మావతి, సిబ్బంది జానకి, కల్యాణి, లోవలక్ష్మి, నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీ



పెద్దిపాలెం పీహెచ్‌సీలో రక్తహీనతపై సమీక్షిస్తున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రకార్ జైన్

ప్రత్తిపాడు రూరల్: పెద్దిపాలెం, రాచపల్లి పీహెచ్‌సీలను శుక్రవారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రకార్ జైన్ తనిఖీ చేశారు. ఈ పీహెచ్‌సీల పరిధిలో గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత కేసులు అధికంగా ఉన్నాయని, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ ఎస్వీ చలం, మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్.నాగేశ్వరరావు, మండల వైద్యాధికారులు ఆర్.పవన్‌కుమార్, ఐ.రత్నంబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సత్కారం



కోటనందూరులో సర్పంచులను అభినందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో అవార్డులు దక్కించుకున్న పంచాయతీ సర్పంచులను ఎంపీపీ లగుడు శ్రీనివాసు అభినందించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర అవార్డు పొందిన బిళ్లనందూరు సర్పంచ్ బొత్స మంగ, జిల్లా అవార్డులు దక్కించుకున్న టీజేనగరం సర్పంచ్ సుర్ల రాంబాబు, కోటనందూరు సర్పంచ్ గర్సింగు శివలక్ష్మితో పాటు పలువురు సర్పంచులను సత్కరించారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం నిర్దారించిన అన్ని విభాగాల్లో గ్రామాలను తీర్చిదిద్దాలని సర్పంచులకు ఎంపీపీ సూచించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ కిచెన్‌తో పౌష్టికాహారం



పెరుమాళ్లపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆహారం పంపిణీ

తొండంగి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్వహిస్తున్న సెంట్రల్ కిచెన్ ద్వారా 5 లక్షల ప్లేట్ల పౌష్టికాహారం అందజేసినట్లు ఆ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో హరేకృష్ణా మూవ్‌మెంట్ చారిటిబుల్ ఫౌండేషన్ భాగస్వామిగా గతేడాది డిసెంబర్ 15న సోలార్ ఎనర్జీతో సెంట్రల్ కిచెన్‌ను ప్రారంభించింది. దీనిద్వారా తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో 42 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరు వేల మంది విద్యార్థులకు రోజూ పౌష్టికాహారాన్ని అందిస్తుంది. నాలుగున్నర నెలల వ్యవధిలో ఐదు లక్షల ప్లేట్ల మిల్లెట్ ఇడ్లీ, ఇడ్లీ, ఉప్మా, బోండా, సాంబార్ ఇడ్లీ వంటి రుచికరమైన పోషకాహారాన్ని అందించగలిగామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి చొరవతో సెంట్రల్ కిచెన్ ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన తీర ప్రాంత గ్రామాల విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు.

వనదుర్గమ్మకు చండీ హోమం



వనదుర్గమ్మ వారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గమ్మ వారికి శుక్రవారం చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవికి, తొలి పాంచా వద్ద వనదుర్గమ్మ వారికి రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో ద్రవ్యాలను సమర్పించారు. అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. ఈ కార్యక్రమాలను వేదపండితులు హనుమంతువజ్జుల అవధాని, సత్యదేవుని ఆలయ అర్చకుడు కంచిభట్ల రామ్‌కుమార్, వనదుర్గ ఆలయ పరిచారకుడు నరసింహమూర్తి, వ్రత పురోహితుడు కూచుమంచి ప్రసాద్ తదితరులు నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. ప్రధానాలయంలో ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో, కొండ దిగువన ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చనలు చేశారు.

బీసీ సంక్షేమ సంఘ కమిటీల నియామకం



సంఘం ఉపాధ్యక్షుడు సాయికుమార్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కొత్త కమిటీలు

జగ్గంపేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల కమిటీలను శుక్రవారం నియమించారు. స్థానికంగా కాకినాడ జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు వియ్యపు అప్పలరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కుండల సాయికుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పంచికట్ల రామకృష్ణ యాదవ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. జగ్గంపేట నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా చీపురపల్లి సత్యనారాయణ, ప్రత్తిపాడు నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా మడబాల బాబ్జీ, కాకినాడ జిల్లా వికలాంగుల సంఘ అధ్యక్షుడిగా గింజాల దుర్గాప్రసాద్ యాదవ్‌ను నియమించారు. అనంతరం వివిధ మండలాలకు కమిటీలు నియమించారు.

దశల వారీగా అభివృద్ధి పనులు





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి
- పలు సమస్యలపై సభ్యుల నిలదీత

తుని: ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ప్రధాన సమస్యలను పరిష్కరిస్తున్నామని, దశల వారీగా పట్టణంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. శుక్రవారం తుని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. అజెండాలో 38 అంశాలను సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. పట్టణాభివృద్ధి విషయంలో అన్ని వార్డులకు సమన్యాయం చేస్తున్నామని, ఎవరూ అపోహలకు గురికావద్దని సుధారాణి అన్నారు. అభివృద్ధికి మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత అందిస్తున్న సహకారానికి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 24వ వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ మాట్లాడుతూ మూడుసార్లు కౌన్సిలర్‌గా ప్రజలు తనను ఎన్నుకున్నారని, ఇప్పటి వరకూ ఏమీ చేయలేకపోయానని అన్నారు. వచ్చే నెలలోనైనా అధికారులు సమస్యలకు పరిష్కారం చూపకపోతే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. రెండేళ్లు వేచి చూశానని, అధికారుల్లో మార్పు లేదని, ఇక్కడ అంతా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ అని సమావేశం నుంచి వెళ్లిపోయారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, శానిటేషన్ బాగోలేదని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వేసవిలో అందరికీ పుష్కలంగా తాగునీరు అందిస్తామని సీపీ సుధారాణి హామీ ఇచ్చారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు మాట్లాడుతూ ఉన్న నిధులతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీతలు పట్టణంలోని 30 వార్డు గణపతినగర్ పార్కు అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. పట్టణంలో పార్కుల అభివృద్ధికి రూ.1.30 కోట్ల నిధులు వచ్చాయని సుధారాణి చెప్పారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహం, సామాజిక భవన నిర్మాణానికి మంత్రి దాడిశెట్టి రాజా రూ.25 లక్షలు ఇవ్వడం అభినందనీయమని కోఆప్షన్ సభ్యుడు కె.జాన్‌బాబు అన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, వైస్ చైర్మన్ పామర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: మండలంలో పలు సమస్యలపై ఎంపీపీ సుంకర శ్రీవల్లి కాకినాడ దిశ సమావేశంలో ప్రస్తావించారు. గోకవరం నుంచి రంపయర్రంపాలెం వెళ్లే రహదారి పూర్తిగా ఛిద్రమైందని, నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఎంటీయూ 1156 రకం ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు క్వింటాలుకు ఎనిమిది కిలోల నుంచి 20 కిలోల వరకు రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, దీనివల్ల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ ఎమ్‌టీయూ 1156 రకం ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ధరకే కొనుగోలు చేయాలని, లేకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోకవరంలో ఇళ్ల స్థలాలు రాని 800 మంది లబ్ధిదారులకు తంటికొండకు వెళ్లే మార్గంలో స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సీహెచ్‌సీకి కుర్చీల బహూకరణ

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు స్నేహ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పాలకుర్తి సురేష్ 50 కుర్చీలు బహూకరించారు. వీటిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం నేతృత్వంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్‌కు అందజేశారు. రోజూ ఆసుపత్రికి వచ్చే రోగులు కూర్చోవడానికి వీటిని సమకూర్చారు. సీహెచ్‌ఓ శర్మ, ఎంపీటీసీ సభ్యుడు ఆకుల శ్రీధర్, వైఎస్సార్ సీపీ నేతలు నీలపల్లి అప్పారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.